ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
వికారాబాద్ - మేడ్చల్
జిల్లాల వార్తలు
5
సోమవారం 3 ఫిబ్రవరి 2025





కరాటే పోటీల్లో పాల్గొన్న విద్యార్థులతో స్పీకర్ ప్రసాద్‌కుమార్

## ఆత్మరక్షణకు కరాటే అవసరం

» అసెంబ్లీ స్పీకర్ జి.ప్రసాద్‌కుమార్

వికారాబాద్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): ఆత్మరక్షణకు ప్రతీ వ్యక్తికి కరాటే అవసరమని తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. ఆదివారం వికారాబాద్ క్లబ్‌లో నిర్వహించిన 6వ నేషనల్ ఓపెన్ కరాటే కుంగ్‌ఫూ చాంపియన్‌షిప్ పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఖాజాపాషా, షాహీన్, విజయ్, ప్రియదర్శిని, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌లో బంగారు, కాంస్య పతకాలు

» సత్తా చాటిన తాండూరు మహిళలు

తాండూరు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో తాండూరు మహిళలు సత్తా చాటారు. తాండూరుకు చెందిన నవనీత, సంతోషి రాష్ట్ర స్థాయిలో గతంలో ప్రతిభ కనబర్చి ప్రస్తుతం జాతీయ స్థాయిలోనూ పతకాలు సాధించారు. 40ఏళ్ల లోపు మహిళల అథ్లెటిక్స్ విభాగం హైజంప్‌లో నవనీత ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాన్ని కైవశం చేసుకున్నారు. అలాగే 50ఏళ్ల లోపు విభాగంలో సంతోషి ట్రిపుల్ జంప్‌లో మూడో స్థానంలో నిలిచి కాస్య పతకాన్ని దక్కించుకున్నారు. ఆమె లాంగ్ జంప్‌లోనూ నాలుగో స్థానంలో నిలిచి పతకాన్ని సాధించారు. వారికి నిర్వాహకులు ఆదివారం త్రిచూర్‌లో జరిగిన ముగింపు వేడుకల్లో బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. పతకాలు సాధించిన మహిళలకు తాండూరు ప్రజలు ఫోన్లలో అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు.



పతకం సాధించిన నవనీత



పతకం సాధించిన సంతోషి





ఇంటర్మీడియట్ సెకండియర్ సైన్స్(ఎంపీసీ, బైపీసీ), అలాగే ఒకేషనల్ గ్రూపుల ఫస్టియర్, సెకండియర్ విద్యార్థులకు నిర్వహించే ప్రాక్టికల్ పరీక్షలు నేటి నుంచి మొదలవనున్నాయి. ఫిబ్రవరి 3వ తేదీ నుంచి 22వ తేదీ వరకు రోజూ ఉదయం, మధ్యాహ్నం రెండు బ్యాచుల్లో పరీక్షలు నిర్వహిస్తారు. కాగా పరీక్షలకు ఇంటర్ బోర్డు జిల్లా అధికారులు, ఆయా కాలేజీల యాజమాన్యాలు అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రతీ సెంటర్‌లో సీసీ కెమెరాల నీడలో పరీక్ష నిర్వహిస్తారు. ప్రత్యేక నిఘా బృందాలు ప్రతీ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తాయి. ప్రాక్టికల్ ఎగ్జామ్స్ పకడ్బందీగా కొనసాగేలా రాష్ట్ర ఇంటర్మీడియట్ విద్యామండలి కార్యాలయ అధికారులు సైతం హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ నుంచి నేరుగా పర్యవేక్షిస్తారు.

# నిఘా నీడలో ప్రాక్టికల్స్

## నేటి నుంచి ఇంటర్ ప్రయోగ పరీక్షలు

ప్రతీ పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరాలు
ఇంటర్ బోర్డు కమాండ్ కంట్రోల్‌తో అనుసంధానం
ఫిబ్రవరి 22వ తేదీ వరకు ఎగ్జామ్స్
విద్యార్థులు గంట ముందే కేంద్రాలకు చేరుకోవాలి
పరీక్ష సమయానికి 15 నిమిషాల కంటే ఎక్కువ ఆలస్యమైతే నో ఎంట్రీ

### పరీక్షలకు తనిఖీ బృందాల నియామకం

ప్రాక్టికల్ పరీక్షలు ఎలా జరుగుతున్నాయో పరిశీలించేందుకు ఇంటర్మీడియట్ విద్యా మండలి ఉన్నతాధికారులు డెక్‌ను ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ చేసింది. పరీక్షలను పర్యవేక్షించేందుకు ఏర్పాటైన డెక్ టీంలో జిల్లా నోడల్ అధికారి, ఒక ప్రభుత్వ జూనియర్ కళాశాల సీనియర్ ప్రిన్సిపాల్, ఒక సీనియర్ జేఎల్ సభ్యులుగా ఉంటారు. అలాగే జిల్లా స్థాయిలో పరీక్షల పర్యవేక్షణకు ఏర్పాటైన హైపవర్ కమిటీకి కలెక్టర్ చైర్మన్‌గా, సభ్యులుగా ఎస్పీ, మెంబర్ కన్వీనర్‌గా ఇంటర్మీడియట్ విద్య నోడల్ అధికారి వ్యవహరిస్తారు.

వికారాబాద్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు ఇంటర్ బోర్డు జిల్లా అధికారులు సర్వం సిద్ధం చేశారు. సోమవారం నుంచి ప్రారంభమయ్యే ఈ పరీక్షలు ఈ నెల 22వ తేదీ వరకు నిర్వహిస్తారు. ఎంపీసీ, బైపీసీ విద్యార్థులతో పాటు ఒకేషనల్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు ఉంటాయి. జిల్లాలో ప్రాక్టికల్ పరీక్షలకు 48 కేంద్రాలను ఏర్పాటు చేశారు. వాటిలో 38 జనరల్, 10 ఒకేషనల్ కేంద్రాలున్నాయి. సైన్స్(జనరల్) విద్యార్థుల్లో సెకండియర్ విద్యార్థులు, ఒకేషనల్ విభాగంలో ఫస్టియర్, సెకెండియర్ విద్యార్థులు ప్రాక్టికల్ పరీక్షలకు హాజరవుతారు. ప్రాక్టికల్ పరీక్షలకు 5,935 మంది సైన్స్, ఒకేషనల్ విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఇంటర్ జనరల్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 3,782 మంది, ఒకేషనల్‌లో ఫస్టియర్ విద్యార్థులు 797, సెకండియర్ విద్యార్థులు 1,356 మంది ఉన్నారు. ఎంపీసీ విద్యార్థులకు ఫిజిక్స్, కెమిస్ట్రీ.. బైపీసీ విద్యార్థులకు బోటని, జువాలజీ, ఫిజిక్స్ కెమెస్ట్రీ ప్రాక్టికల్ పరీక్షలు ఉంటాయి. ఒకేషనల్ విద్యార్థులకు ఆయా కోర్సుల ప్రాక్టికల్స్ ఎగ్జామ్స్ నిర్వహిస్తారు. ఈ నెల 3వ తేదీ నుంచి 22వ తేదీ వరకు రోజూ ఉదయం, మధ్యాహ్నం

మిగతా 8వ పేజీలో...

## పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

జిల్లా నోడల్ అధికారి ఎన్.శంకర్‌నాయక్



వికారాబాద్: నేటి నుంచి జరిగే ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలకు జిల్లాలో పకడ్బందీ ఏర్పాట్లు చేశామని ఇంటర్ బోర్డు జిల్లా నోడల్ అధికారి శంకర్‌నాయక్ ఆదివారం తెలిపారు. పరీక్ష ప్రారంభమైన 15 నిమిషాల తరువాత విద్యార్థులను సెంటర్‌లోకి అనుమతించం అని చెప్పారు. ప్రతీ పరీక్ష కేంద్రంలో కంప్యూటర్, ఇంటర్నెట్, ప్రింటర్ వంటి సౌకర్యాలు, ప్రతీ సైన్స్ ల్యాబ్‌లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని తెలిపారు. రాష్ట్ర ఇంటర్ బోర్డు అధికారులు కమాండ్ కంట్రోల్ సెంటర్లో సీసీ కెమెరాల ద్వారా ప్రాక్టికల్ పరీక్షలను పర్యవేక్షిస్తారన్నారు. పరీక్ష నిర్వహణలో పాల్గొనే సిబ్బంది గుర్తింపు కార్డులు తప్పక కలిగి ఉండాలన్నారు. ఇంటర్ జనరల్ ద్వితీయ సంవత్సరంలో 3,782 మంది, ఒకేషనల్ ప్రథమ సంవత్సరంలో 797 మంది, ద్వితీయ సంవత్సరంలో 1,356 మంది విద్యార్థులు ప్రాక్టికల్ పరీక్షలకు హాజరవుతారన్నారు. జనరల్ ప్రాక్టికల్ పరీక్షలకు 38, ఒకేషనల్ పరీక్షలకు 10 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి 12 వరకు, మధ్యాహ్నం 2నుంచి 5 గంటల రోజూ రెండు విడతల్లో పరీక్షలు నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు. ప్రాక్టికల్ పరీక్షల హాల్ టికెట్, టైమ్ టేబుల్‌ను వారి కాలేజీ ప్రిన్సిపాళ్ల నుంచి విద్యార్థులు తీసుకోవచ్చని తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల కోసం ఆర్టీసీ తగినన్ని సర్వీసులు నడుపుతుందన్నారు.

### ఇదీ ప్రాక్టికల్ పరీక్షల లెక్క

| వికారాబాద్ జిల్లా | |
|---|---|
| జనరల్ | 3,782 |
| ఒకేషనల్ | 2,153 |
| విద్యార్థులు | 5,935 |
| పరీక్ష కేంద్రాలు | 48 |

| మేడ్చల్-మల్కాజ్‌గిరి.. | |
|---|---|
| జనరల్ | 1,24,115 |
| ఒకేషనల్ | 2,308 |
| విద్యార్థులు | 1,26,423 |
| పరీక్షా కేంద్రాలు | 150 |

# మహిళా క్యాంటీన్‌ను నిర్వహించలేం!

మూడు నెలలుగా పైసా రాబడి లేదు
చేతులెత్తేసేందుకు సిద్ధమవుతున్న మహిళలు
కలెక్టర్‌కు చెప్పినా పరిష్కారం శూన్యం
నీరుగారుతున్న సర్కారు లక్ష్యం

మేడ్చల్ ప్రతినిధి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): మహిళలను లక్షాధికారులను చేసేందుకు ప్రభుత్వం అడుగులు వేసింది. బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాలతో చిన్నపాటి వ్యాపారాలు కొనసాగిస్తున్న స్వయం సహాయక సంఘాల(ఎస్‌హెచ్‌జీ)ను మరింత బలోపేతం చేసేందుకు నిర్ణయించి, ఇందులో భాగంగా కొందరితో క్యాంటీన్లు పెట్టించి ఆర్థికంగా బలోపేతం చేయాలని సంకల్పించింది. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలో పలుచోట్ల మహిళా క్యాంటీన్లు ఏర్పాటు చేయాలనే లక్ష్యం విధించారు. ఈ నేపథ్యంలో మేడ్చల్ కలెక్టరేట్‌లోనూ మూడు నెలల క్రితం అన్ని హంగులతో ఇందిరమ్మ మహిళా క్యాంటీన్‌ను ప్రారంభించారు. ప్రభుత్వ ఆర్థిక సాయంతో ఏర్పాటు చేసిన ఈ క్యాంటీన్‌ను మహిళా సంఘాల సభ్యులకు కేటాయించారు. మహిళా సంఘాల సభ్యులు ఐదుగురు ఈ క్యాంటీన్‌ను నిర్వహిస్తున్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా రూ.8లక్షలతో క్యాంటీన్‌ను ఏర్పాటు చేయగా.. స్త్రీనిధి నుంచి రూ.3లక్షల రుణం తీసుకొని క్యాంటీన్‌ను నడుపుతున్నారు. మహిళలు సంతోషంగా

మిగతా 8వ పేజీలో...

### అధికారుల ప్రోత్సాహం కరువు



మేడ్చల్ కలెక్టరేట్‌లోని మహిళా క్యాంటీన్



### త్వరలోనే సమస్యను పరిష్కరిస్తాం

కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ మహిళా క్యాంటీన్‌లో నెల కొన్న ఇబ్బందులు నా దృష్టికొచ్చాయి. ఇప్పటికే రెండు, మూడు సార్లు కలెక్టరేట్ పైఅంతస్తులోకి భోజనాన్ని సరఫరా చేస్తున్న ప్రైవేట్ వ్యక్తికి ఇది మానుకోవాలని చెప్పాం. బయటి క్యాంటీన్ ఆహారాన్ని కలెక్టరేట్‌లోకి పంపొద్దన్నాం. నిబంధనల మేరకైతే అతడు ఆహార పదార్థాలను బయటే అమ్ముకోవాల్సి ఉంటుంది. మా ఆదేశాలు పాటించకుంటే త్వరలోనే చర్యలు తీసుకుంటాం.

- సాంబశివరావు, డీఆర్‌డీఓ, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా



### ఘనంగా రక్తమైసమ్మ జాతర

తాండూరు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): తాండూరు పట్టణ గంజ్ మర్రిచెట్టు కూడలిలో గల రక్తమైసమ్మ ఆలయ జాతర వైభవంగా జరిగింది. ఆదివారం అమ్మవారిని పూలు, నగలతో ప్రత్యేకంగా అలకరించారు. ఆలయాన్ని లైట్లతో డెకరేట్ చేశారు. అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం మహిళలు బోనాల ఊరేగింపు నిర్వహించి నైవేద్యాన్ని సమర్పించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. పట్టణంలోని గంజ్, హైదూర్ వార్డు, విజయ విద్యాలయం, బసవన్నకట్ట, గాంధీచౌక్ ప్రాంతాల ప్రజలు ఆలయానికి తరలొచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ స్వప్న, స్థానిక నాయకులు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు.

## కేటీఆర్.. నువ్వెన్ని ప్రదక్షిణలు చేసినా...

# మీ ఖేల్ ఖతం!

» అంబేడ్కర్ విగ్రహం వేదికగా రాజకీయాలా?
» పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి మండిపాటు



విలేకరులతో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి

పరిగి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ నాయకుడు కేటీఆర్ అధికారం కోల్పోయి మతిభ్రమించి మాట్లాడుతున్నాడని డీసీసీ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం పరిగిలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. కేటీఆర్ నువ్వెన్ని ప్రదక్షిణలు చేసినా మీ ఖేల్ ఖతం. దుకాణం బంద్ అని ఎద్దేవా చేశారు. సచ్చిన పార్టీని బతికించేందుకు కేసీఆర్ కుటుంబీకులు పడుతున్న పాట్లను ప్రజలు నమ్మడం లేదన్నారు. ప్రజలు ఛీ కొట్టినా ఏదో ప్రయోజనం పొందేందుకు అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని వేదికగా చేస్కోవడం సిగ్గుచేటన్నారు. అంబేద్కర్ ఆశయాలే తెలియని కేటీఆర్.. ఆయన విగ్రహం వద్ద చిల్లర రాజకీయాలు చేస్తూ నోటికొచ్చినట్టు మాట్లాడటం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశాడు. కేసీఆర్ పదేళ్లలో చేసింది, కాంగ్రెస్ ఏడాదిలోనే చేసి చూపిందన్నారు. కేసీఆర్ సినిమాకు రేవంత్‌రెడ్డి ఎప్పుడో ఎండ్‌కార్డు వేశారని, ఇంకా మీరు మాట్లాడేందని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి దెబ్బకు బీఆర్ఎస్ నాయకులంతా మూలన పడుకున్నారని, ఫామ్ హౌజుల్లో, గెస్ట్ హౌసుల్లో రెస్ట్ తీసుకుంటున్నారని ఎద్దేవా చేశాడు. కేసీఆర్ అంటేనే నమ్మక ద్రోహం, ఫామ్‌హౌజ్‌లూ, గడీలపాలన అన్నారు. తెలంగాణ ఆత్మగౌరవం గురించి మాట్లాడేది కేటీఆరా? లిక్కర్ స్కాంలో తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని ఢిల్లీలో తాకట్టు పెట్టిన ఘనత మీది కాదా? అని ప్రశ్నించారు. ఈ-ఫార్ములా కేసులో అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ ఆత్మగౌరవాన్ని మంటకలిపింది ఎవరన్నారు. 'లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు మీకు గుండు సున్నా చేశారు. పంచాయితీ ఎన్నికల్లోనైతే పారిపోయేలా చేస్తారు.' అని అన్నారు. పదేళ్ల పాలనలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వని మీరా శివారెడ్డిపల్లి గురించి మాట్లాడేది అని ప్రశ్నించారు. కేటీఆర్.. ఎప్పుడైనా శివారెడ్డిపల్లికి రా? ఏం చేశామో చూపిస్తాం అని సవాల్ విసిరారు. కాగా దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా రూ.21వేల కోట్ల మేర రైతులకు రుణమాఫీ చేశామని, రూ.10వేల కోట్లు రైతుల ఖాతాల్లో వేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో పరిగి, కులకచర్ల ఏఎంసీ చైర్మన్లు బి.పరశురాంరెడ్డి, ఆంజనేయులు, నాయకులు కె.ఆనందం, తావుర్యానాయక్, అయూబ్‌హుస్సేన్, రవికాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కాంపౌండ్లను కూల్చడం సరికాదు



సమావేశంలో మాట్లాడుతున్న నల్ల మల్లారెడ్డి

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): కాలనీల రక్షణ కోసం నిర్మించుకున్న గోడలను, గేట్లను హైడ్రా అధికారులు కూల్చడం సరికాదని దివ్యానగర్ కాలనీ వ్యవస్థాపక అధ్యక్షుడు నల్ల మల్లారెడ్డి అన్నారు. ఆదివారం కాచవానిసింగారం దివ్యానగర్ కాలనీ కమ్యూనిటీ హాల్ వద్ద నిర్వహించిన దివ్యానగర్ ప్లాట్స్ ఓనర్స్ అసోసియేషన్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ.. గత నెల 25న దివ్యానగర్ ఫేజ్ 6, 6ఎ, బి, సి కాలనీల ప్రహరీ గోడలను, గేట్లను హైడ్రా అధికారులు కూల్చారని ఆరోపించారు. కాలనీల ప్రహరీలను నిర్మించి 20 ఏళ్లు అవుతోందని, వీటితో ఎవరికీ ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. ఎవరూ ఫిర్యాదు చేయకున్నా కాంపౌండ్లను కూల్చారని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీల్లో సర్వే కూడా చేయలేదని తెలాపారు. ప్రజల అభిప్రాయాలనైనా సేకరించలేదని అన్నారు. అధికారుల అనాలోచిత, తొందరపాటు నిర్ణయాలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని వాపోయారు. తాము నిబంధనల ప్రకారమే కాలనీలను నిర్మించామని, ఈ విషయంలో ఎవరూ అధైర్యపడొద్దన్నారు. కార్యక్రమంలో ప్లాట్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సంపత్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## ఎన్‌ఎస్ఎస్‌తో విద్యార్థుల్లో సేవాగుణం

» తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకృష్ణారెడ్డి

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): సేవాభావం, క్రమశిక్షణ, నిబద్ధత లక్షణాలు నేషనల్ సర్వీస్ స్కీం(ఎన్ఎస్ఎస్) కార్యక్రమాలతో విద్యార్థులకు అలవడతాయని తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకృష్ణారెడ్డి అన్నారు. మేడ్చల్ జిల్లా పోచారం మున్సిపాలిటీ పరిధి వెంకటాపూర్‌లోని అనురాగ్ యూనివర్సిటీలో ఆదివారం నిర్వహించిన ఎన్ఎస్ఎస్ ఓరియంటేషన్ ప్రోగ్రాంకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నేటి పోటీ ప్రపంచంలో ఎప్పటికప్పుడు మిమ్మల్ని మీరు మెరుగుపర్చుకోవాలని విద్యార్థులకు ఆయన సూచించారు. ఎన్ఎస్ఎస్ శిక్షణ, చేపట్టే కార్యక్రమాలతో విద్యార్థుల్లో సామాజిక సేవ, క్రమశిక్షణ, పట్టుదల, నిబద్ధత వంటి లక్షణాలు అలవడతాయన్నారు. నేటి సాంకేతిక యుగంలో పరిజ్ఞానాన్ని పెంపొందించుకుంటూ రాణించాలని ఈ సందర్భంగా తెలిపారు. విద్యార్థులు జీవితంలో ఎంత ఎదిగినా సామాజిక బాధ్యతను మరవొద్దన్నారు. ఈ కార్యక్రమంలో అనురాగ్ యూనివర్సిటీ సీఈవో ఎస్.నీలిమ, వైస్ చాన్స్‌లర్ అర్చన, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ మల్లేష్, వర్సిటీ డీన్ విజయ్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఓరియంటేషన్ ప్రోగ్రాంలో పాల్గొన్న బాలకృష్ణారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు

## ఆధ్యాత్మికతతోనే సంపూర్ణ జీవనం


మాట్లాడుతున్న భాస్కరయోగి

పరిగి,ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మానవులు ఆధ్యాత్మికతతో కలిగిన జీవితం పరిపూర్ణ లక్ష్యానికి కారణం అవుతుందని ఆధ్యాత్మికవేత్త డాక్టర్ పి.భాస్కరయోగి అన్నారు. భాస్కర ఫౌండేషన్-హిందూ ధార్మిక సమితి ఆధ్వర్యంలో ఆదివారం పరిగిలో జరిగిన మాఘ సంత్సంగంలో ఆయన ప్రసంగిస్తూ, వేదాలు, శాస్త్రాలు సూచించిన విధానంలో జీవించడమే సనాతన ధర్మం మూల సూత్రమని పేర్కొన్నారు. ఆధ్యాత్మిక చింతన, విలువలు బోధించే సంత్సంగాల ద్వారా పరివర్తన చెంది పరిపూర్ణమైన విధానాన్ని పొందాలన్నారు. శాస్త్ర ఆధారంగా జీవన విధానంతోపాటు, సంప్రదాయాలను అనుసరిస్తే భగవంతుడి కరుణ ఉంటుందని, తద్వారా పరిపూర్ణ జీవితానికి అవకాశం ఉంటుందన్నారు. సామాజిక సమరత వేదిక కన్వీనర్ అప్పల ప్రసాద్ మాట్లాడుతూ, సామరస్యత కోసం ఎందరో మహనీయులు పాటుపడ్డారని, వారి అడుగుజాడల్లో నడుచుకోవాలని సూచించారు.

# కాంగ్రెస్‌లోకి చేరికలు


ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు


రాఘవాపూర్‌లో రక్తమైసమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన పూజలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, నేతలు

యాలాల, ఫిబ్రవరి 2, (ఆంధ్రజ్యోతి) : పలువురు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. ఆదివారం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సమక్షంలో చేరగా వారికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. చేరిన వారిలో యమునగారి చంద్రయ్య, మంగలి లోకేష్, నేతి బసప్ప, కుమ్మరి బాలప్పతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు ఉన్నారు. కార్యక్రమంలో యాలాల పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి, పగిడ్యాల ఏఎంసీ డైరెక్టర్ నర్సింహులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, మత్స్య కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీధర్, అగ్గనూరు వెంకటయ్య, భీమయ్య, కలాల్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

### రక్తమైసమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన

మండలంలోని రాఘవాపూర్‌లో రక్తమైసమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన పూజా కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్థానిక నాయకులతో కలిసి తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి, నాయకులు హన్మంతు, రాఘవాపూర్ అమర్‌నాథ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అన్నసాగర్ సత్యనారాయణరెడ్డి, మైపాల్, శ్రీధర్ పాల్గొన్నారు.

## చైన్‌స్నాచింగ్ పేరిట నాటకం

**కూతురి ఆర్థిక ఇబ్బందులు తీర్చాలని తల్లి యత్నం**

**పోలీసుల రంగప్రవేశంతో అసలు విషయం వెలుగులోకి..**

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): కూతురి ఆర్థిక ఇబ్బందులు తీర్చాలని ఓ తల్లి చైన్‌స్నాచింగ్ నాటకం ఆడింది. పోలీసుల రంగప్రవేశంతో అసలు విషయం బట్టబయలైన ఘటన ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలోని అవుషాపూర్‌లో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ అవుషాపూర్‌కు చెందిన చీమల లక్ష్మమ్మ(60) తన కూతురు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతుంది. తన వద్ద ఉన్న నాలుగు తులాల బంగారు మంగళసూత్రం అమ్మి ఇద్దామనుకుంటే కొడుకుకు తెలుస్తుందని భావించింది. ఆదివారం ఉదయం 7 గంటల ప్రాంతంలో ఇంటి నుంచి దుకాణానికి వెళ్తుండగా మెయిన్‌రోడ్డు వద్ద బంగారపు మంగళసూత్రాన్ని బైక్‌పై వచ్చిన గుర్తుతెలియని దుండగులు లాక్కెళ్లారంటూ కన్నీరు పెట్టుకుంటూ కొడుకుకు చెప్పింది. వెంటనే అతను 100కు డయల్ చేసి సమాచారం ఇచ్చాడు. ఇక్కడికి చేరుకున్న సీఐ పరుశురాం వెంటనే నాలుగు బృందాలను ఏర్పాటు చేసి వాహనాల తనిఖీలు చేపట్టారు. స్థానికంగా ఉన్న సీసీ ఫుటేజీలను పరిశీలిస్తే దుండగులకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లభించలేదు. దీంతో అనుమానం వచ్చి ఆమెను విచారించగా అసలు విషయం చెప్పింది. తన కూతురుకు ఆర్థిక ఇబ్బందులున్నాయని, అందుకే నాటకమాడినట్లు తెలిపింది.

### ఆలయ నిర్మాణానికి చేయూత

నందిగామ, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): మోత్కుళ్లగూడ లో నూతనంగా నిర్మిస్తున్న హనుమాన్ దేవాలయానికి షాద్‌నగర్ పట్టణంలోని సాయిరాజ ఫంక్షన్‌హాల్ యజమాని సాయికృష్ణ ఆదివారం రూ.21వేల చెక్కును దేవాలయ కమిటీ సభ్యులకు అందజేశారు. సాయికృష్ణకు కృతజ్ఞతలు కమిటీ సభ్యులు తెలిపారు.

## ఆత్మరక్షణకు కరాటే దోహదం


కరాటే పోటీలను హాజరై ప్రారంభించిన మునిసిపల్ మాజీ చైర్ పర్సన్ మంజుల

వికారాబాద్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కరాటే ఆత్మరక్షణగా దోహదపడుతుందని మునిసిపల్ మాజీ చైర్ పర్సన్ మంజుల రమేష్ అన్నారు. వికారాబాద్ క్లబ్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం 6వ నేషనల్ ఓపెన్ కరాటే కుంగ్ ఫూ చాంపియన్‌షిప్ 2025 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కరాటేలో విద్యార్థులను ప్రోత్సహిస్తున్న పీటీలకు, పీడీలకు, మాస్టర్లను అభినందించారు. నిర్వాహకులు ఖాజాపాషా మాట్లాడుతూ.. జాతీయస్థాయిలో జరిగే ఈ పోటీల్లో మహారాష్ట్ర, కర్ణాటక, వెస్ట్ బెంగాల్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి 800 మంది విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారని తెలిపారు. ఇందులో ఎక్కువగా బాలికలే ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రమేష్‌కుమార్, మాలే లక్ష్మణ్, దీపు, సర్ఫరాజ్, సందీప్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవారి సేవలో తరించాలి



బొంరాస్‌పేట్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానంలో నిర్వహించే శ్రీవారి సేవకు వెళ్లి తరించాలని టీటీడీ ఆర్గనైజర్ చంద్రశేఖర్‌గౌడ్ అన్నారు. మండలంలోని రేగడిమైలారంలో ఆదివారం టీటీడీ సేవకు వెళ్లే సేవకులతో కలిసి ఆయన సమావేశం నిర్వహించారు. ఈనెల 4న కుమ్మరి వెంకటయ్య బృందం 15 మంది, 24న దాసరి రాములు బృందం 12మంది, నెల్లి అంజిలయ్య బృందం 15 మంది శ్రీవారి సేవకు బయల్దేరనున్నారు. వారం రోజుల పాటు శ్రీవారి సేవలో ఉంటూ టీటీడీ భక్తులకు సేవలందించనున్నారు. 40 ఏళ్లుగా శ్రీవారి సేవకు సేవకులను తరలిస్తున్నట్లు ఆయన తెలిపారు.

# ఆలయం.. అపవిత్రం!

- రామలింగేశ్వరాలయం వద్ద జోరుగా మద్యం విక్రయాలు
- తాగి చిందేస్తున్న మందుబాబులు
- ఆలయ పవిత్రతకు విఘాతం
- దెబ్బతింటున్న భక్తుల మనోభావాలు
- చోద్యం చూస్తున్న సంబంధిత అధికారులు


రామేశ్వరంలోని రామలింగేశ్వరాలయం

షాద్‌నగర్ అర్బన్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): 'రామేశ్వరం వెళ్లినా శనేశ్వరం' వదలదన్నట్టు ఫరూక్‌నగర్ మండలంలోని రామేశ్వరంలోని రామలింగేశ్వరాలయం మందుబాబుల వీరంగాలతో అపవిత్రంగా మారుతోంది. చుట్టుపక్కల మద్యం, కల్లు విక్రయాలు జరుగుతుండడంతో ఆలయ పవిత్రతకు విఘాతం కలుగుతున్నది. ఆలయ పరిసరాలను ఆనుకుని ఉన్న ఇళ్లలో అక్రమంగా మద్యం, కల్లు ప్యాకెట్లు విక్రయిస్తున్నారు. వాటిని కొన్న మందుబాబులు ఆలయ పరిసరాల్లోకి వెళ్లి తాగి చిందులేస్తున్నారు. సాయంత్రం కాగానే భక్తుల మనోభావాలు దెబ్బతినేలా వ్యవహరిస్తున్నారు. కొందరి స్వార్థంతో నిత్యకృత్యంగా మారుతున్న ఈ వ్యవహారంపై దేవాదాయశాఖ అధికారులు, ఎక్సైజ్‌శాఖ అధికారులు, గ్రామ ప్రజాప్రతినిధులు చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. వచ్చే మహాశివరాత్రి ఉత్సవంలో మద్యం, కల్లు, మాంసం విక్రయాలు జరగకుండా ముందునుంచే నిఘా ఉంచాలని భక్తులు కోరుతున్నారు.


రామలింగేశ్వరాలయ పరిసరాల్లో మద్యం సీసాలు, కల్లు ప్యాకెట్లు

### ఎక్సైజ్ శాఖకు ఫిర్యాదు చేస్తా..

రామేశ్వరాలయం పరిసరాల్లో మద్యం, కల్లు విక్రయాలు జరగకుండా కట్టడి చేయడానికి ఎక్సైజ్‌శాఖ, పోలీసుశాఖ అధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తా. పుణ్యక్షేత్రంలో ఎలాంటి మత్తు పదార్థాలు, మాసం విక్రయించడానికి ఏ మాత్రం వీలు లేదు. మద్యం తాగినా... మాంసాహారం భుజించినా ఆలయ ప్రవేశం లేదు.

- శివకుమార్, ఆలయ ఈఓ

### చట్టపర చర్యలు తప్పవు

పవిత్ర పుణ్యక్షేత్రమైన రామేశ్వరంలో మద్యం, కల్లు విక్రయాలకు ఎలాంటి అనుమతులు లేవు. చట్ట విరుద్ధంగా మద్యం, కల్లు విక్రయించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. సాధారణ రోజులతోపాటు జాతర సమయంలో కూడా మద్యం, కల్లు విక్రయాలు జరగకుండా చర్యలు తీసుకుంటాం.

- శేఖర్, ఎక్సైజ్ సీఐ


ధర్నాలో మాజీ జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, కాంగ్రెస్ నేతలు

## బడ్జెట్ కేటాయింపులో వివక్ష తగదు

కందుకూరు,ఫిబ్రవరి 2,(ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్ కేటాయింపుల్లో రాష్ట్రం పట్ల వివక్ష చూపడం సరికాదని మాజీ జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి అన్నారు. ఆ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆదివారం సాయంత్రం కాంగ్రెస్ మహేశ్వరం ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డితో పాటు పార్టీ నేతలతో కలిసి ఆయన నగరంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిర్వహిస్తున్న ధర్నాకు తరలివెళ్లా రు. సంక్షేమ పథకాలను విమర్శిస్తున్న బీజేపీ ఎంపీలు కేంద్ర బడ్జెట్‌పై ఎందుకు మౌనంగా ఉన్నారని ఆయన ప్రశ్నించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వెంకటేష్ గౌడ్, డిల్లీ శ్రీధర్, విష్ణువర్ధన్‌రెడ్డి, వీరారెడ్డి, వత్తుల నారాయణ పాల్గొన్నారు.

## ఘనంగా భక్తమార్కండేయ జయంత్యుత్సవాలు


డోలారోహణంలోమహిళలు

ఆమనగల్లు , ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి ): పట్టణంలోని భక్తమార్కండేయ స్వామి దేవాలయంలో స్వామి వారి జయంతిని అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆలయాన్ని తోరణాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. మహిళా సంఘం ఆధ్వర్యంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా భక్తులకు ఏర్పాట్లు చేశారు. ఆదివారం డోలారోహణం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మహిళా సంఘ సభ్యులు అప్పం అలివేలు, అప్పం శ్రీలత, ఉదయశ్రీ, హేమలత, కల్పన, వనజ, రాజ్యలక్ష్మి, సుని, దేవాలయ అధ్యక్షుడు ఎంగిళి బాలకృష్ణ, నాయకులు అప్పం శ్రీను, ఈశ్వరయ్య, గిరి, సత్యరాములు, అంజనేయులు, భాస్కర్, శ్రీను, శివ తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు


ఆలయంలో గౌడ సంఘం నాయకులు

ఆమనగల్లు , ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి ): పట్టణంలోని కంఠమహేశ్వర స్వామి దేవాలయ ఆవరణలో నూతనంగా నిర్మించిన పబ్బంతి ఆంజనేయ స్వామి, రేణుక ఎల్లమ్మ, మైసమ్మ, నవగ్రహాలు, కౌండిన్యమహర్షి ఆలయాల్లో విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు ఆదివారం వైభవంగా ముగిశాయి. నాలుగు రోజుల పాటు అత్యంత భక్తిశ్రద్ధలతో కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ చుక్క అల్లాజీగౌడ్, ప్రధాన కార్యదర్శి గంగ రవీందర్‌గౌడ్, గౌడ సంఘం మండల అధ్యక్షుడు చుక్క నిరంజన్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేశారు. వేడుకలకు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు జైపాల్ యాదవ్, చల్లా వంశీచందర్‌రెడ్డి, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి, బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్‌లు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. దాతలు, ఉత్సవ కమిటీ సభ్యులకు అల్లాజీ గౌడ్, రవీందర్ గౌడ్‌ల ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో నారాయణ గౌడ్, యాదయ్యగౌడ్, బాలకృష్ణ గౌడ్, వెంకటయ్య, సతీష్, యాదయ్య, నరేశ్ గౌడ్, కుమార్, అల్లాజీ, మోహన్, శివ, శ్రీను, నర్సింహ, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా బ్రహ్మోత్సవాలు ప్రారంభం


ఆలయంలో పూజలు చేస్తున్న ఆలయ నిర్వాహకులు, నాయకులు

ఆమనగల్లు ,ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి ): జిల్లాలో ప్రసిద్ధి గాంచిన ఆమనగల్లు మండలం శెట్టిపల్లి గ్రామ అలివేలు మంగ సమేత వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఐదు రోజులపాటు కనుల పండువగా కొనసాగే బ్రహ్మోత్సవాల కోసం ఆలయాన్ని తోరణాలు, పుష్పాలతో శోభాయామానంగా అలంకరించారు. భక్తుల సౌకర్యార్థం స్థానిక మాజీ సర్పంచ్ గోదాదేవి సత్యం, ఆలయ చైర్మన్ సింగిని శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేశారు. తొలిరోజు అలివేలు మంగ సమేత వేంకటేశ్వర స్వామికి సుప్రభాత సేవతో అర్చకులు మొల్లారి నవీన్‌శర్మ, గూడ కృష్ణమాచార్యులు మేలుకొలుపు పాడారు. అనంతరం విశ్వక్‌సేన ఆరాధన, పుణ్యహవాచనం, దేవత ఆహ్వానం, అంకుర్పారణ, ధ్వజారోహణం, బలిహరణం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా ప్రజలు, భక్తులు పాల్గొని పూజలు చేశారు. సోమవారం స్వామివారి కల్యాణం క్రతువు జరుపుతారు. కార్యక్రమంలో ,నాయకులు, అర్చకులు ,భక్తులు తదితరులు ఉన్నారు.

## గ్రామాల బాగుతోనే దేశాభివృద్ధి

- జిల్లా దిశా కమిటీ సభ్యుడు నందు
- ఎంపీ నిధులతో పనులు ప్రారంభం


పనుల ప్రారంభం అనంతరం స్వీట్ తినిపించుకుంటున్న నాయకులు

మోమిన్‌పేట్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): గ్రామాల బాగుతోనే దేశ అభివృద్ధి సాధ్యపడుతుందని, ఎంపీ కొండ విశ్వేశ్వర్‌రెడ్డి చేవేళ్ల పార్లమెంట్ పరిధిలోని గ్రామాల అభివృద్ధికి నిధులు మంజూరుచేస్తున్నారని జిల్లా దిశా కమిటీ సభ్యుడు, బీజేపీ జిల్లా కో ఆర్డినేటర్ వడ్ల నందు, దిశా కమిటీ చైర్మన్ డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మోమిన్‌పేట్ మండలం మేకవనంపల్లిలో రూ.50 లక్షలతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. మొట్టమొదటి సారిగా గ్రామానికి ఎంపీ నిధులు మంజూరు చేయగా పనులను ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఆశిరెడ్డి, జేకేఎంఆర్ ఫౌండర్ రాములు, మోమిన్‌పేట్ మండల మాజీ అధ్యక్షుడు భుజంగరెడ్డి, లక్ష్మారెడ్డి, సంగారెడ్డి, విఠలస్వామి, మల్లేశ్ యాదవ్, ఎర్రోళ్ల లక్ష్మయ్య, శ్రీశైలం గౌడ్, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అలరించిన సంగీత్ ఉత్సవ్


సత్యధామంలో నిర్వహిస్తున్న సంగీత కచేరి

మర్పల్లి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మర్పల్లి మండలం బిల్కల్‌లో కొలువుదీరిన సత్యనారాయణస్వామి సత్యధామంలో శనివారం రాత్రి సంగీత్ ఉత్సవ్-2025 అందరినీ అలరించింది. నేటి తరానికి ఆధ్యాత్మికతతో పాటు సంస్కృతీ సంప్రదాయాలపై కనీస అవగాహన కల్పించాలన్న సంకల్పంతో కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆలయ వ్యవస్థాపకులు దుర్గప్రసాద్ ఆధ్వర్యంలో కేరళకు చెందిన ప్రముఖ సంగీత విద్వాంసులు ప్రిన్స్ రామవర్మ బృందం కచేరి కొనసాగింది. రామవర్మ గీతాలాపన చేయగా, వయోలిన్ అవనీశ్వరం ఎస్ఆర్ విను, మృదంగం హరికుమార్, ఘటం డాక్టర్ ఎస్ కార్తీక్ వాయించారు. నాలుగు గంటల పాటు కొనసాగిన కచేరిని వీక్షించేందుకు వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు తరలి వచ్చారు. కార్యక్రమానికి మార్గదర్శి ఎండీ శైలజా కిరణ్, రేరా చైర్మన్ సత్యనారాయణ, హైకోర్టు న్యాయవాదులతో పాటు హైదరాబాద్‌కు చెందిన పలువురు ప్రముఖులు హాజరయ్యారు.

# యువత క్రీడల్లో రాణించాలి



విజేత జట్టుకు కప్‌ను అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

తాండూరు రూరల్, ఫిబ్రవరి 2, (ఆంధ్రజ్యోతి): యువత క్రీడల్లో రాణించాలని ఆర్పీఎల్ సీఈవో శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని కరన్‌కోట్‌లో డాక్టర్ వికాస్ స్మారక క్రికెట్ పోటీలు జరిగాయి. ఈ పోటీల ముగింపు సందర్భంగా ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. క్రీడలతో ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. వాటిని ప్రోత్సహించి ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించాలన్నారు. డాక్టర్ వికాస్ పేరిట క్రీడలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన జట్టుకు కప్‌ను అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాజ్‌కుమార్, మాజీ ఎంపీపీ శరణబసప్ప, కాంగ్రెస్ నాయకులు అనిల్ పాల్గొన్నారు. అంతకుముందు ఆర్పీఎల్ శ్రీనివాస్‌రెడ్డిని నాయకులు మాజీ ఎంపీటీసీ కె.నర్సయ్య గౌడ్ శాలువాతో ఘనంగా సన్మానించారు.

### కరాటేలో విద్యార్థుల సత్తా

దుద్యాల: మహబూబ్‌నగర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన ఎంపీ కప్ ఓపెన్ కరాటే అండ్ కుంగ్‌ఫూ చాంపియన్ షిప్‌లో దుద్యాల మండల విద్యార్థులు ప్రతిభ చాటారు. బొంరాస్‌పేట్ మండలంలోని కేజీబీవీ చెట్టుపల్లి తండా పాఠశాల విద్యార్థినులు శిరీష, నిఖిత బంగారు పతకాలు సాధించగా అనిత, శివానీ, సోనాలి, ఆద్య వెండి పతకాలు, నందిని, వైశాలీ, గాయత్రి, మీనాక్షి రజత పతకాలు సాధించారు. అలాగే దుద్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన అభినయశ్రీ బంగారు పతకం, సంధ్యారాణి, అక్షిత రజత పతకాలు సాధించారు. హస్నాబాద్ నేతాజీ పాఠశాల విద్యార్థిని కే.రిత్విక బంగారు పతకం సాధించింది. వీరిని ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

### బాడీబిల్డింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థికి సన్మానం

యాలాల: పాత తాండూరుకు చెందిన అభిషేక్ హైదరాబాద్ మల్లాపూర్‌లో జరిగిన నేషనల్ బాడీబిల్డింగ్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. ఈ సందర్భంగా యాలాల మండల పీఆర్టీయూ అధ్యక్షుడు సి.కృష్ణారెడ్డి, జనరల్ సెక్రెటరీ రాములు, వ్యాపారవేత్త చాట్ల విశ్వనాథ్‌లు అభిషేక్‌ను ఆదివారం సన్మానించారు. మెన్స్ ఫిజిక్ విభాగంలో మొదటి, మూడో బహుమతి సాధించడం అభినందనీయమన్నారు.

## నిధుల సాధనలో బీజేపీ ఎంపీలు విఫలం

మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్


ధర్నాలో కాంగ్రెస్ నాయకులు

మహేశ్వరం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : కేంద్రం ఏ మాత్రం రాష్ట్రానికి బడ్జెట్‌ను కేటాయించలేదని మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్, దేప భాస్కర్‌రెడ్డి, బొక్క జంగారెడ్డిలు అన్నారు. తెలంగాణ నుంచి ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు ఉన్నారని, అయినా నిధులు తేవడంలో వారు పూర్తిగా విఫలమయ్యారన్నారు. ఆదివారం నగరంలోని ట్యాంక్‌బండ్ వద్ద కాంగ్రెస్ చేపట్టిన ధర్నాకు మహేశ్వరం నియోజకవర్గం పార్టీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. కార్యక్రమంలో నందిగామ నర్సింహా, వెంకటేష్‌గౌడ్, రాజునాయక్, రవి, లాజర్, ప్రవీణ్, శ్రీధర్, శివ, వంశీ రెడ్డి తదితరులు ఉన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

కేంద్ర మంత్రి రాందాస్



శంషాబాద్, ఫిబ్రవరి 2 ( ఆంధ్రజ్యోతి) : ఎస్సీ బీసీ, మైనార్టీ, క్రిష్టియన్ల అభ్యున్నతికి కృషి చేస్తామని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా(ఏ) జాతీయ నాయకుడు కేంద్ర మంత్రి రాందాస్ అథవాలే అన్నారు. శంషాబాద్‌లోని ఎంఎంఆర్ గార్డెన్‌లో ఆదివారం ఆ పార్టీ క్రిష్టియన్ మైనార్టీ వింగ్ ఆలిండియా అధ్యక్షుడు డాక్టర్ జాన్ ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కేంద్ర మంత్రి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. అంబేడ్కర్ ఆశయాలు సాధిస్తామని, జైభీం అంటూ ఏపీ, తెలంగాణలో కూడా తమ పార్టీ కార్యకలాపాలను విస్తరిస్తున్నామన్నారు. అన్ని వర్గాల ప్రజల సమస్యల పరిష్కారానికి పోరాడుతామన్నారు. ఈ సందర్భంగా కార్యకర్తలు కేంద్ర మంత్రిని గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు డాక్టర్ జాన్, వెంకటేశ్వర్లు, బ్రహ్మానంద రెడ్డి, పీ.రవి, పద్మ పాల్గొన్నారు.

## న్యాయపోరాటంతోనే ప్లాట్లు సాధించుకుంటాం

హైకోర్టు న్యాయమూర్తి జుబేర్ అక్రం


మాట్లాడుతున్న జుబేర్ అక్రం

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి) : ఏకశీలనగర్ ప్లాట్స్ ఓనర్స్ వైపే న్యాయం ఉందని, న్యాయ పోరాటంతోనే ప్లాట్లు సాధించుకుంటామని హైకోర్టు న్యాయవాది జుబేర్ అక్రం తెలిపారు. పోచారం మున్సిపాలిటీ, కొర్రెముల ఏకశీలనగర్ ప్లాట్స్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏకశీలనగర్‌పై కేసులంటిన్నిలోను ప్రత్యర్థి అలూరి వెంకటేష్ ఓడిపోయాడని చెప్పారు. న్యాయం తమవైపే ఉందని అసోసియేషన్ సభ్యులకు తెలిపారు. ప్లాట్స్ ఓనర్స్ ఎల్ఆర్ఎస్ ఉన్నవాళ్లు మున్సిపాలిటీ అనుమతితో ఇళ్లు నిర్మించుకోవచ్చని తెలిపారు. అయితే రాజకీయ, ధనబలంతోనే వెంక టేష్ తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఎన్ని కుయుక్తులు పన్నిన తామే విజయం సాధిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్లాట్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మాణిక్యాల్ రావు, ఉపాధ్యక్షుడు శివారెడ్డి, విజయసేనారెడ్డి, ముత్తారెడ్డి, శ్రీనివాస్, అమీర్ అక్రం, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర నిధులతో గ్రామాల అభివృద్ధి


సీసీ రోడ్డు ప్రారంభిస్తున్న బీజేపీ జిల్లా కార్యవర్గసభ్యులు దొడ్డ సందీప్‌కుమార్

పెద్దేముల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర నిధులతో గ్రామాలు అభివృద్ధి చెందుతాయని బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు దొడ్డ సందీప్‌కుమార్ అన్నారు. మండలంలోని మంబాపూర్‌లో ఆదివారం రూ.2లక్షల ఎంపీ నిధులతో చేపట్టిన సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో గ్రామాలన్ని అభివృద్ధి చెందుతున్నాయన్నారు. ప్రజలు కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బూత్ అధ్యక్షుడు నరేందర్, బీజేపీ సీనియర్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, దస్తప్ప, దాస్, భీమప్ప పాల్గొన్నారు.

## ఏ ముఖం పెట్టుకొని వస్తారు?

- కొడంగల్‌ను దత్తత తీసుకొని మీరేం చేశారు?
- కేటీఆర్‌ను నిలదీసిన కాంగ్రెస్ నాయకులు


మాట్లాడుతున్న కాంగ్రెస్ మండల నాయకులు

బొంరాస్‌పేట్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కేటీఆర్ బీఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల పాలనలో కొడంగల్‌ను దత్తత తీసుకొని ఏం చేశావని కాంగ్రెస్ మండల నాయకులు ప్రశ్నించారు. ఆదివారం బొంరాస్‌పేట్‌లో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహులుగౌడ్ మాట్లాడుతూ ఐదేళ్లు కొడంగల్‌ను దత్తత తీసుకొని ఏం చేశావని ప్రశ్నించారు. ప్రశాంతంగా ఉన్న కొడంగల్‌లో అలజడి రేపేందుకు వస్తావా అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి చొరవతో కొడంగల్ నియోజకవర్గం రాష్ట్రంలోనే అభివృద్ధిలో దూసుకెళ్తుందన్నారు. ఈ నియోజకవర్గానికి అభివృద్ధి నిరోధకుడిగా ఏ ముఖం పెట్టుకొని వస్తావని అన్నారు.

# పుచ్చ సాగు.. లాభాలు బాగు

- యాసంగిలో రైతులు ఆసక్తి
- ఎకరా పెట్టుబడి రూ. 80 వేలు
- లాభం రూ. లక్ష నుంచి లక్షన్నర
- ఈ పోషకాల ఫలానికి గిరాకీ ఎక్కువే



దామస్తాపూర్‌లో సాగు చేస్తున్న పుచ్చ పంట, ఏపుగా కాసిన కాయలు

మర్పల్లి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): పుచ్చ పంటను రైతులు సాగు చేస్తున్నారు. ఆరోగ్యంతోపాటు ఆదాయం కూడా లాభసాటిగా మారడమేనని తెలుస్తోంది. మరోవైపు తక్కువ సమయంలోనే పంట చేతికి వస్తుంది. మహాశివరాత్రి సందర్భంగా దీక్షా కార్యక్రమాలతో పాటు వేసవి సమీపిస్తుండటం కూడా కలిసివస్తుంది. మార్కెట్లోనూ గిరాకీ ఉండటంతో సాగు చేపట్టేందుకు ఆసక్తిని కనబరుస్తున్నారు. ఆ మేరకు కథనం..


మర్పల్లి మండలం దామస్తాపూర్, మర్పల్లి, సిరిపూరం గ్రామాలతో పాటు పలు గ్రామాల కొంత మంది రైతులు 20 ఎకరాల్లో పుచ్చ సాగు చేస్తున్నారు. పెట్టుబడి ఎకరానికి రూ.60 వేల నుంచి రూ.80వేల వరకు ఖర్చు చేస్తున్నారు. పంట 80 నుంచి 90 రోజుల్లో చేతికి వస్తుంది. ఎకరానికి 20 నుంచి 25 టన్నుల దిగుబడి వస్తుందని రైతులు తెలిపారు. కేజీ ధర 10 రూపాయల చొప్పున పంట విక్రయిస్తే రూ.లక్ష నుంచి లక్షన్నర వరకు లాభ వస్తుందని చెబుతున్నారు. అయితే అధిక డిమాండ్ ఉంటే కిలో రూ.30 నుంచి రూ.40 వరకు విక్రయిస్తారు. ఎండల ప్రారంభంలోనే శివరాత్రి పండుగ ఉంది. ప్రజలు ఉపవాస దీక్షలతో సాయంత్రం పుచ్చకాయలు తినేందుకు ఆసక్తి కనబరుస్తారు. అయితే నవంబరు, డిసెంబర్‌లో సాగు చేస్తే ఫిబ్రవరిలో చేతికి వస్తుందని రైతులు చెబుతున్నారు.

### లాభాలు ఎన్నో

పుచ్చకాయలో 80 శాతం నీటి శాతం ఉండటంతో వేసవి తాపం నుంచి ప్రజలకు ఉపశమనంతో పాటు రక్తహీనతను తగ్గించేందుకు దోహదపడుతుంది. కాయలు ఫ్రిజ్‌లో నిల్వ ఉంచకుండా తింటే పోషకాలు లభిస్తాయని, ఒకవేళ నిల్వ చేస్తే ఇవి తగ్గుతాయని వైద్యులు తెలిపారు. ఎప్పటికప్పుడు తాజా కాయలను తింటే ఆరోగ్యానికి మేలు జరుగుతుందన్నారు.

## మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యం

- లక్ష్మి మెగా సెంట్రల్ సిటీ మెగావెంచర్‌కు ఆదరణ
- అధ్యక్షకార్యదర్శులు రాంచంద్రన్, సతీష్‌కుమార్



మాట్లాడుతున్న రాంచంద్రన్, సతీష్‌కుమార్

కొత్తూర్, ఫిబ్రవరి 2: (ఆంధ్రజ్యోతి) కొత్తూర్, నందిగామ మండలాల్లో ఏర్పాటు చేసిన లక్ష్మి మెగా సెంట్రల్ సిటీలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి సభ్యులు నడుం బిగించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్లాట్స్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రామచంద్రన్, ప్రధానకార్యదర్శి సతీష్‌కుమార్‌లు పిలుపునిచ్చారు. ప్లాట్ల యాజమానుల అసోసియేషన్ 4వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం నందిగామలో ఉన్న లక్ష్మి మెగా సెంట్రల్ సిటీ లేఅవుట్‌లో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెంచర్‌లో విద్యుత్, మంచినీటి సరఫరా, మురుగు నీటి కాలువల నిర్మాణ సమస్యలను గుర్తించామన్నారు. వాటిని పరిష్కరించేందుకు సభ్యులు సహకారం అందించాలన్నారు. అసోసియేషన్‌లో చేరని ప్లాట్ల యాజమానులు వెంటనే సభ్యత్వాలు తీసుకోవాలని సూచించారు. వెంచర్‌లో చేపట్టే అభివృద్ధి పనుల గురించి సభ్యులకు తెలిపారు. రాష్ట్ర రాజధానికి, అంతర్జాతీయ విమానాశ్రయానికి అతి చెరువలో ఉన్న మెగావెంచర్ దినాదినాభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి ప్రసాద్, ఉపాధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

## మహిళా క్యాంటీన్‌ను నిర్వహించలేం!

(5వ పేజీ తరువాయి)

క్యాంటీన్‌ను ప్రారంభించి కొన్నాళ్లు వంటలు చేస్తూ కలెక్టరేట్ సిబ్బందితో పాటు, పనుల కోసం కలెక్టరేట్‌కు వచ్చే ప్రజలకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందిస్తున్నారు. కానీ కలెక్టరేట్ సమీపంలోనే ఉన్న మరో వ్యక్తికి చెందిన క్యాంటీన్ నుంచి భోజనాన్ని నేరుగా కలెక్టరేట్ పైఅంతస్తు కార్యాలయాలకు అందిస్తుండటంతో మహిళా క్యాంటీన్ గిరాకీపై తీవ్ర ప్రభావం చూపింది. దీంతో ఆర్భాటంగా ఏర్పాటు చేసిన మహిళా క్యాంటీన్‌కు ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. దీనిపై మహిళా సంఘాల సభ్యులు డీఆర్‌డీఏ పీడీకి, కలెక్టరేట్ పాలనాధికారికి ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ క్యాంటీన్ ఉండగా కలెక్టరేట్‌లో ప్రైవేట్ క్యాంటీన్ భోజనాన్ని ఎలా విక్రయిస్తారని మహిళలు నెత్తీనోరు మొత్తుకున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. మహిళల ఆవేదన చూడలేక పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు సైతం ఈ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. అయినా పరిష్కారం కాలేదు. దీనికి ప్రధాన కారణం కలెక్టరేట్ పాలనాధికారి సదరు ప్రైవేట్ వ్యక్తికి అండగా ఉండడమేనని ఆరోపణలు వస్తున్నాయి. ఏదేమైనా చేసేది లేక క్యాంటీన్ నిర్వహణ మహిళలు ఇక తాము నష్టాల్లో ఉన్న ఈ క్యాంటీన్‌ను నడపలేమంటూ చేతులెత్తేసేందుకు సిద్ధమయ్యారు. మూడు నెలలుగా ఎంత కష్టపడుతున్నా పైసా రాబడి లేదని, కలెక్టరేట్ ప్రాంగణంలోని ప్రైవేట్ క్యాంటీన్‌ను మూసేయించాలని అధికారులను కోరుతున్నా ఫలితం లేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తమతో క్యాంటీన్ పెట్టించి వేరే వారికి సహకరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. గిరాకీ రాని క్యాంటీన్‌ను మూసివేయడం తప్ప తమకు వేరే దారిలేదని స్వయం సహాయక సంఘం మహిళలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకోవాలని కోరుతున్నారు.

### అధికారుల సమన్వయ లోపంతోనేనా?

కలెక్టరేట్‌లో ప్రారంభించిన మహిళా క్యాంటీన్ నిరుగారిపోయేందుకు అధికారుల్లో నెలకొన్న సమన్వయలోపమే కారణమనే ప్రచారం జరుగుతోంది. కలెక్టరేట్ ఏఓ ఒకరికి పత్తాసు పలుకుతుండగా, డీఆర్‌డీఏ పీడీ మహిళా క్యాంటీన్‌కు అనుకూలంగా ఉన్నట్లు విస్తృతంగా ప్రచారం సాగుతోంది. దీనిని సరిదిద్దాల్సిన అధికారులెవరూ పట్టించుకోకే ఇందిరమ్మ క్యాంటీన్ మూతపడే వరకు వచ్చిందని కలెక్టరేట్ సిబ్బంది చర్చించుకుంటున్నారు.

# 'పది' పరీక్షే!

- బోర్డు ఎగ్జామ్ రాయాలంటే 25 కిలోమీటర్లు వెళ్లాల్సిందే
- దుద్యాల మండల విద్యార్థుల వెతలు
- నాలుగు పాఠశాలల్లో 164 మంది విద్యార్థులు



దుద్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

దుద్యాల, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): నూతనంగా ఏర్పడిన దుద్యాల మండల కేంద్రంలో పదో తరగతి పరీక్షా కేంద్రం కేటాయించకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విద్యాసంవత్సరం మండలంలో కుదురుమళ్ల, హకీంపేట్, కేజీబీవీ చెట్టుపల్లి తండా, దుద్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 164 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నారు. అందులో 100 మంది బాలికలే ఉన్నారు. దుద్యాల, హకీంపేట్ పాఠశాలల్లో 51 మంది చొప్పున విద్యార్థులు, కుదురుమళ్లలో 18, కేజీబీవీ చెట్టుపల్లి తండాలో 44 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నారు. అయితే దుద్యాల మండల కేంద్రంలో పదో తరగతి పరీక్షా కేంద్రం లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు తప్పడంలేదు. హకీంపేట్, దుద్యాల, కేజీబీవీ చెట్టుపల్లితండా పాఠశాలల విద్యార్థులు బొంరాస్‌పేట్ మండల కేంద్రంలోని పరీక్షా కేంద్రానికి వెళ్లాల్సి వస్తోంది. అల్లిఖాన్‌పల్లికి చెందిన విద్యార్థులైతే దాదాపు 20 నుంచి 25 కిలో మీటర్లు ప్రయాణించాల్సిన పరిస్థితి. దీంతో దూరభారం కారణంగా పరీక్షలకు సమయానికి సమయానికి హాజరు కావడం కష్టంగా మారింది. ముఖ్యంగా గిరిజన గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులకు రవాణా సౌకర్యము లేదు. పరీక్షలకు హాజరయ్యే కొన్ని గ్రామాల విద్యార్థులకు ఉదయం, మధ్యాహ్నం సమయంలో బస్సు సౌకర్యం అందుబాటులో ఉండదు. ఆటోలు, బొలెరో, ఇతర ప్రైవేట్ వాహనాల్లో వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ఎండాకాలం ఉక్కపోతతో నిలబడి ప్రయాణించాల్సి వస్తుందని విద్యార్థులు వాపోతున్నారు. మండల కేంద్రంలో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుందని కోరుతున్నారు. దుద్యాల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ముందు భాగంలో నూతనంగా పోలీస్‌స్టేషన్ కూడా ఏర్పడింది. దీంతో బందోబస్తు వెసులుబాటుకు అవకాశం ఉంటుంది. సంబంధిత అధికారులు స్పందించి విద్యార్థుల ఇబ్బందులను గుర్తించి మండల కేంద్రంలో పరీక్షా కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

**అధికారులు స్పందించాలి**



మా పాపను పరీక్షా కేంద్రానికి పంపించాలంటే ఇబ్బందులు ఎదుర్కొవాల్సిన దుస్థితి ఉంది. పనులు వదులుకొని పరీక్షా కేంద్రానికి తీసుకెళ్లి తిరిగి ఇంటికి తీసుకురావాల్సి ఉంటుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పరీక్షా కేంద్రాన్ని దుద్యాల మండల కేంద్రంలో ఏర్పాటు చేయాలి.

- రాములు, దుద్యాల

**25 కిలోమీటర్లు ప్రయాణించి పరీక్ష రాయాలి**



అల్లిఖాన్‌పల్లి నుంచి బొంరాస్‌పేట్ మండల కేంద్రానికి వెళ్లాలంటే దాదాపు 20 నుంచి 25 కిలో మీటర్లు ప్రయాణించాల్సి ఉంటుంది. దీంతో పరీక్షా కేంద్రానికి వెళ్లే లోపు అలసిపోయే పరిస్థితి. తిరుగు ప్రయాణంలో కూడా మండే ఎండలో ప్రయాణించాల్సి వస్తుంది. దుద్యాల మండల కేంద్రంలో పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

- కవిత, పదో తరగతి విద్యార్థిని, అల్లిఖాన్‌పల్లి

## ఎమ్మార్పీఎస్ మహాప్రదర్శనను విజయవంతం చేద్దాం

పెద్దేముల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ రిజర్వేషన్‌లు అమలు చేయాలని ఈ నెల 7న హైదరాబాద్‌లో తలపెట్టిన 'లక్ష డప్పులు, వేల గొంతుల సాంస్కృతిక మహాప్రదర్శన'ను విజయవంతం చేద్దామని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కోడిగంటి మల్లికార్జున్ మాదిగ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం కార్యక్రమ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి స్వామిదాస్, హరిసుదన్, కోడిక్రిష్ణ, బాలు, గోపాల్, రాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.



పెద్దేముల్‌లో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కోడిగంటి మల్లికార్జున్

కొడంగల్: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో చేపట్టే లక్ష డప్పులు, వేయి గొంతుకలను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా సీనియర్ నాయకుడు ఎస్.సోమశేఖర్ సోమ వారం విలేకరుల సమావేశంలో పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నాయకులు దస్తప్ప, దాము, అశోక్ తదితరులు ఉన్నారు.

దుద్యాల: ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహా ప్రదర్శనను జయప్రదం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. దుద్యాల మండలంలోని నాజ్‌ఖాన్‌పల్లి గ్రామంలో కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆదివారం విడుదల చేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మల్లప్ప, అంజి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కీసర: లక్ష డప్పులు- వేల గొంతుల కార్యక్రమం వాల్ పోస్టర్‌ను ఆదివారం కీసరలో జాతీయ కళా మండలి అధ్యక్షుడు ఎన్వీ అశోక్ విడుదల చేశారు. కార్యక్రమంలో మండల నాయకులు పాల్గొన్నారు.

పూడూరు: ఈనెల 7వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించే వేలగొంతుల లక్షల డప్పుల కార్యక్రమ వాల్‌పోస్టర్‌ను ఇబ్బెంల గ్రామంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మహజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు పి.ఆనంద్ మాదిగ, డాక్టర్ కొండపల్లి రమేష్ మాదిగ, గడ్డం ముత్యంటి, దేవనోనిగూడెం వెంకటయ్య, రమేష్, శ్రీనివాస్, సత్తయ్య, నర్సింహులు, విజయ్ పాల్గొన్నారు.

నవాబుపేట: మండల కేంద్రంలో లక్ష డప్పులు, వేయి గొంతుకల మహా ప్రదర్శనకు సంబంధించిన కరపత్రాలను ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు రవికుమార్, శేఖర్, రాంచంద్రయ్య, అంజయ్య, జాన్, చంద్రం, బద్రీ, చంద్రయ్య, నగేశ్, కిష్టయ్య, సుధాకర్ ఆదివారం విడుదల చేశారు.

## కేసీఆర్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే



తాండూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి ఆదివారం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తాజా రాజకీయ పరిస్థితులపై చర్చించారు. తాండూరు ప్రాంతంలో రాజకీయ పరిస్థితులను కేసీఆర్‌కు వివరించారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో మెజార్టీ సీట్లు గెలవాలని కేసీఆర్ పైలెట్‌కు సూచించారు. ఆయన వెంట రితేష్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

# కార్యకర్తలకు అండగా ఉంటా

మోమిన్‌పేట్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): పార్టీ కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటానని బీఆర్ఎస్ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. మోమిన్‌పేట్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకుడు బాలు చేతికి గాయం కావడంతో ఆదివారం గ్రామానికి వెళ్లి పరామర్శించారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు వెంకటయ్య, పీఏసీఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, సీనియర్ నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, గోపాల్, శ్రీరాములు, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

**వివాహ వేడుకలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే**

మోమిన్‌పేట మండల కేంద్రంలోని టీకేర్ ఫంక్షన్ హాల్‌లో దుర్గంచెరువు గ్రామ బీఆర్ఎస్ నాయకుడు కొండల్ యాదవ్ కూతురితో వికారాబాద్ నియోజకవర్గంలోని అనంతగిరిపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు గోపాల్ సోదరుడు లక్ష్మయ్యతో ఆదివారం జరిగిన వివాహిది కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు.



బీఆర్ఎస్ నాయకుడు బాలును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆనంద్

## టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ప్రారంభం



టైలరింగ్ శిక్షణను ప్రారంభిస్తున్న గ్రామస్థులు

చౌడాపూర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మరికల్ గ్రామంలో ఎక్సెల్ గ్రామ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత టైలరింగ్ శిక్షణను ప్రారంభించారు. శిక్షణ మూడు నెలల పాటు కొనసాగుతుందని, మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మరికల్ గ్రామపెద్దలు రామ్మోహన్‌శర్మ, దామోదర్‌రెడ్డి, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా బడ్జెట్

పరిగి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్ కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా ఉందని నిరసిస్తూ ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో పరిగిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి సభ్యుడు ఎం.వెంకటయ్య మాట్లాడుతూ.. కేంద్రం ప్రకటించిన బడ్జెట్‌లో వ్యవసాయ, విద్య, వైద్య రంగాలను పూర్తిగా విస్మరించిందన్నారు. పేదలకు కడుపు నింపే ఉపాధిహామీ పథకానికి నిధుల తగ్గింపు చేయడమేంటని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు హబీబ్, సత్తయ్య, రఘురాం, శేఖర్, రాజేందర్, సాయి, వినోద్, నర్సింహులు, బాబు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

## ఎంపీడీవో, ఇన్‌చార్జి ఎంపీవో బాధ్యతల స్వీకరణ

దోమ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండల నూతన ఎంపీడీవోగా నరేందర్, ఇన్‌చార్జి ఎంపీవోగా రాజేశ్ బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న మహేశ్‌బాబు హైదరాబాద్ కమిషనర్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అకౌంట్ ఆఫీసర్‌గా బదిలీపై వెళ్లారు. దోమలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న నరేందర్ ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించారు. అదేవిధంగా ఎంపీవోగా విధులు నిర్వహిస్తున్న సోమలింగం చౌడాపూర్ మండల ఎంపీడీవోగా ఉద్యోగోన్నతిపై వెళ్లారు. దిర్సంపల్లి పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న రాజేశ్ ఇన్‌చార్జి ఎంపీవోగా బాధ్యతలు స్వీకరించారు.

## నేడు ఉపాధిహామీ పనులపై ప్రజావేదిక

తాండూరు రూరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలో నేడు (సోమవారం) జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పనులపై ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీవో విశ్వప్రసాద్, ఉపాధిహామీ ఏపీవో నరోత్తంరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 1 జనవరి 2023 నుంచి 31 మార్చి 2024వ తేదీ వరకు గ్రామపంచాయతీల్లో జరిగిన పనులను 17 జనవరి 2024 నుంచి 2 ఫిబ్రవరి 2024వరకు సామాజిక తనిఖీ బృందం గ్రామాల్లో సందర్శించి పనులను తనిఖీ చేసి గ్రామసభలు నిర్వహించారు. ఇట్టి పనులకు సంబంధించి నివేదికను నేడు(సోమవారం) ఉదయం 10గంటలకు తాండూరు మండల కార్యాలయ ఆవరణలో ప్రజావేదిక నిర్వహించనున్నట్లు తెలిపారు.

## యాదవ సంఘం గ్రామ కమిటీ

దుద్యాల, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): దుద్యాల మండలంలోని ఆలేడ్ గ్రామ యాదవ సంఘం నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శ్రీనివాస్‌యాదవ్, ప్రధాన కార్యదర్శిగా ఆనంద్‌యాదవ్, ఉపాధ్యక్షుడిగా వెంకటేశ్‌యాదవ్, అంజనేయులు యాదవ్, కోశాధికారిగా మల్లేశ్‌యాదవ్, కార్యదర్శులుగా రామలింగంయాదవ్, యాదయ్య యాదవ్, మోహన్ యాదవ్‌తో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు జంగలి యాదయ్య యాదవ్ మాట్లాడుతూ యాదవులు అన్ని రంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు.

## అసత్య కథనాలు రాస్తే కఠిన చర్యలు: సీఐ

వికారాబాద్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): పత్రికల్లో అసత్య కథనాలు రాస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ భీమ్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓ వ్యక్తి అదృశ్యమైన కేసులో ఫిర్యాదు చేసిన వారి వివరాలు వెల్లడించడం జరిగిందని, అదృశ్యమైన వ్యక్తి సైతం పోలీస్ స్టేషన్‌కు వచ్చిన వివరాలు వెల్లడించి లేఖ రాసి ఇచ్చినట్లు తెలిపారు. అయితే కొన్ని పత్రికల్లో వివిధ రకాలుగా వార్తలు ప్రచురించారని తెలిపారు. తనను ఎలాంటి వివరణ కోరకుండా వార్తలు రాయడం వల్ల ప్రజల్లో మంచి కన్నా చెడు ఎక్కువ ప్రభావం చూపుతుందని, అలా చేసే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## క్రైం కార్నర్

### రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

- మరో ఇద్దరికి గాయాలు

మూడుచింతలపల్లి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన శామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కేశవరం గ్రామానికి చెందిన మణిదీప్(21), బన్నీ(19), మధు (22) ముగ్గురు స్నేహితులు. మణిదీప్ తన కొత్త పల్సర్ 220బైక్‌పై ఇద్దరు స్నేహితులను తీసుకొని మూడుచింతలపల్లి మండలానికి సరదాగా గడిపేందుకు వెళ్లారు. మధ్యాహ్నం తిరిగి గ్రామానికి వస్తుండగా మూలంపల్లి వద్ద బైక్ అదుపుతప్పి కిందపడిపోయారు. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న బన్నీయాదవ్ అక్కడికక్కడే మృతిచెందాడు. మణిదీప్, మధులకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

### చికిత్స పొందుతూ వ్యక్తి..

కీసర, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు తాళలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి ఆదివారం చికిత్స పొందుతూ మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కీసర గ్రామానికి చెందిన జూపల్లి రమేష్(42) భార్య కొంతకాలం కిందట అనారోగ్యంతో మృతి చెందింది. ఇద్దరు పిల్లలు కావడంతో రమేష్ ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురై రెండు రోజుల కిందట పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే లక్ష్మక్కపల్లిలోని ఆర్‌వీఎం ఆస్పత్రికి తరలించగా ఆదివారం చికిత్స పొందుతూ మృతిచెందాడు.

### రెండు వాహనాలు ఢీ.. ఆరుగురికి గాయాలు



ప్రమాదానికి గురైన కార్లు

పరిగి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఓ కారు లారీని ఓవర్‌టేక్ చేయబోయి ఎదురుగా వస్తున్న బొలెరోను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆరుగురికి గాయాలయ్యాయి. మండలంలోని రూప్‌ఖాన్‌పేట్ శివారులో ఆదివారం సాయంత్రం ఈ ప్రమాదం జరిగింది. క్షతగాత్రులను ఉప్పలికు చెందినవారిగా గుర్తించారు. కొడంగల్‌లో పెళ్లికి వెళ్లి తిరుగు ప్రయాణంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం నగరానికి తరలించారు. పరిగి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### రెండు ఇసుక ట్రాక్టర్ల సీజ్

దారూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): దారూరు అటవీ రేంజ్ పరిధి గుండా అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు రేంజర్ రాజేందర్ ఆదివారం తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. రేంజ్ పరిధిలోని రాస్నం అటవీ ప్రాంతం నుంచి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత గస్తీ తిరుగుతున్న ఎఫ్‌బీవో వీరబాబు, సిబ్బంది ఒమేర్, శ్రీధర్‌లు ట్రాక్టర్లను పట్టుకున్నారు. యాలాల మండలం, దేవనూర్ గ్రామానికి చెందిన పాపా, నరేందర్‌లు అనుమతులు లేకుండా దేవనూర్ వాగు నుంచి ఇసుకను తవ్వి ట్రాక్టర్ల ద్వారా అటవీ ప్రాంతం గుండా దారూరుకు తరలిస్తున్నట్లు గుర్తించారు. పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని రేంజ్ కార్యాలయానికి తరలించారు. జిల్లా అటవీశాఖ అధికారికి నివేదిక పంపించి తదుపరి చర్యలు తీసుకుంటామని రేంజర్ రాజేందర్ వివరించారు.

## మాజీ కౌన్సిలర్‌కు సన్మానం



మాజీ కౌన్సిలర్ అనంత్‌రెడ్డిని సన్మానిస్తున్న కాలనీ వాసులు

వికారాబాద్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): 15వ వార్డు సాకేతనగర్ కౌన్సిలర్ అనంత్‌రెడ్డి పదవీ కాలం ముగియడంతో కాలనీ వాసులు ఆదివారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ పెద్దలు ఆయనను ఘనంగా సన్మానించారు.

## సీఎం రేవంత్‌రెడ్డి రైతు పక్షపాతి



సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

పరిగి రూరల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వమని, సీఎం రేవంత్‌రెడ్డి రైతుపక్షపాతి అని కాంగ్రెస్ ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు తోర్నాల నాయక్ అన్నారు. పరిగి పట్టణ పరిధిలోని సుల్తాన్‌పూర్‌లో ఆదివారం కాంగ్రెస్ నాయకులు, రైతులతో కలిసి సీఎం, స్థానిక ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. సుల్తాన్‌పూర్ గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేయడం సంతోషదాయకమన్నారు.

## ఊరడమ్మ ఆలయ నిర్మాణానికి భూమిపూజ

వికారాబాద్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రవల్లి గ్రామంలో ఊరడమ్మ ఆలయ నిర్మాణానికి గ్రామస్థులు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్, ఆర్పీ మెంబర్ ఎర్రవల్లి జాఫర్ పాల్గొని పూజలు నిర్వహించారు. త్వరలో ఆలయ నిర్మాణం పూర్తి చేసేందుకు కృషి చేస్తామని గ్రామస్థులు పేర్కొన్నారు.

## అ'పూర్వ' సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

కీసర, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కీసర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1984-85 బ్యాచ్ 10వ తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. తాము చదువుకున్న పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తమకు చదువు నేర్పిన గురువులు ఆహ్వానించి, వారికి ఘనంగా సన్మానించి, ఆశీర్వచనాలు తీసుకున్నారు.

## శివనామస్మరణతో మార్మోగిన భవానీ నగర్



పూజా కార్యక్రమంలో పాల్గొన్న స్థానికులు

తాండూరు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): తాండూరు పట్టణం భవానీ నగర్‌లోని శ్రీ రామలింగేశ్వర దేవాలయం శివనామస్మరణతో మార్మోగింది. మాలధారణ ధరించిన శివస్వాములు ఆదివారం మహాపడిపూజను నిర్వహించారు. శ్రీశైలంలోని శివుడు భ్రమరాంబిక కొలువై ఉన్న ప్రతిరూపాలను పెట్టి పూజలు చేశారు. పూజారి జగదీశ్వర్ స్వామి ఆధ్వర్యంలో అభిషేకం, 18 మెట్ల పూజను నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## సీసీ రోడ్డు పనులు ప్రారంభం

చౌడాపూర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వాల్యానాయక్ తండాలో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆదేశానుసారం రూ.10లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఆదివారం కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అశోక్‌కుమార్, నాయకులు రాఘవనాయక్, నవీన్ పాల్గొన్నారు.

## నేడు వసంత పంచమి

- తాండూరులో సామూహిక అక్షరాభ్యాసం

తాండూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): తాండూరు పట్టణంలోని పలు విద్యాలయాల్లో నేడు (సోమవారం) వసంత పంచమి వేడుకలను నిర్వహించేందుకు ముస్తాబు చేశారు. సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించేందుకు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు సిద్ధమయ్యాయి. పట్టణంలోని సరస్వతి శిశు మందిర్, సాయి మేధా విద్యాలయం, కృష్ణవేణి కాన్సెప్ట్ స్కూల్‌తో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహిస్తున్నట్లు కరస్పాండెంట్‌లు తెలిపారు.

## నిఘా నీడలో ప్రాక్టికల్స్

(5వ పేజీ తరువాయి)

రెండు బ్యాచుల్లో పరీక్షలు జరుగుతాయి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల పరీక్షలుంటాయి. కాగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో మొత్తం 1,26,423 మంది జనరల్, ఒకేషనల్ విద్యార్థులు ప్రాక్టికల్ పరీక్షలకు హాజరవుతారు. 1,24,115 మంది జనరల్, 2,308 మంది ఒకేషనల్ విద్యార్థులు ప్రాక్టికల్స్‌కు హాజరవుతారు.

### సమయానికి ముందుగానే హాజరవ్వాలి

ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించే కాలేజీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. పకడ్బందీ నిఘాలో ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించేలా ఇంటర్ బోర్డు నిర్ణయించింది. రోజూ రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహించనుండగా, ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయి. పరీక్ష ప్రారంభానికి అరగంట ముందు ఎగ్జామినర్లు ఇంటర్ బోర్డు వెబ్‌సైట్ నుంచి పరీక్ష పేపర్లు డౌన్‌లోడ్ చేసుకుంటారు. బ్యాచ్, సెషన్ ప్రకారం ఏ విద్యార్థి ఏ ప్రయోగం చేయాలనేది నిర్ణయిస్తారు. ప్రయోగం పూర్తికాగానే విద్యార్థుల జవాబుపత్రాలను వెంటనే వాల్యుయేషన్ చేసి మార్కులను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. ప్రాక్టికల్ పరీక్షల పర్యవేక్షణకు ఒక్కోకేంద్రానికి ఒక డీఓ సూపరింటెండెంట్‌ను నియమించారు. ఉదయం ప్రారంభమయ్యే పరీక్ష ప్రశ్నాపత్రాన్ని 8.30 గంటలకు, మధ్యాహ్నం నిర్వహించే ప్రాక్టికల్ పరీక్ష ప్రశ్నాపత్రాన్ని 1.30గంటలకు ఇంటర్ బోర్డు వెబ్‌సైట్ నుంచి ఎగ్జామినర్లు డౌన్‌లోడ్ చేసుకుంటారు.

### అవకతవకలకు ఆస్కారం లేకుండా...

పరీక్షల్లో అవకతవకలు జరగకుండా ప్రతీ పరీక్ష కేంద్రంలో నాలుగు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. సెంట్రల్ కెమెరాలన్నింటినీ హైదరాబాద్‌లోని ఇంటర్మీడియట్ విద్యా మండలి ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానించారు. దీంతో ఉన్నతాధికారులు తామున్న చోటునుంచే పరీక్షలను పర్యవేక్షించే సౌలభ్యం కలుగుతోంది. ఏ పరీక్ష కేంద్రంలో ప్రాక్టికల్ పరీక్షలు ఎలా నిర్వహిస్తున్నారో నేరుగా రాష్ట్ర కమాండ్ కంట్రోల్ రూం నుంచి పరిశీలిస్తారు. పరీక్షల్లో కొందరు మార్కులు ఇబ్బడిముబ్బడిగా వేస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో ఇంటర్ బోర్డు ప్రత్యేక చర్యలు తీసుకుంది. సీసీ కెమెరాల ఏర్పాటును ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలు వ్యతిరేకించినా బోర్డు అధికారులు లెక్కచేయకుండా ఎగ్జామ్స్ అన్నీ నిఘా నీడలోనే నిర్వహించేందుకు చర్యలు తీసుకుంది.